

సంస్కృతి, సంప్రదాయాలేవీ?



పెద్దపల్లిరూరల్: అందరం ఒక్కచోటే గుమిగూడి చప్పట్లు కొడుతూ..పాటలు పాడే సంస్కృతి, సంప్రదాయాలు కనిపించడం లేదు. ఇప్పుడు డీజే పాటలు, ఇష్టానురీతిగా డ్యాన్సులు చేయడం ఫ్యాషనుగా మారింది. ఆధునిక సాంకేతికతతో మన సంస్కృతి, సంప్రదాయాలకు ముప్పు కలుగుతోంది. – వసంత, పెద్దకల్వల

ఇప్పుడు అన్నీ కొనుడే



పెద్దపల్లిరూరల్: అప్పట్లో బతుకమ్మ పండుగ వచ్చిందంటే చెట్లకోసం వెతికి పూలు కోసుకువచ్చేటోళ్లం. స్నేహితులతో కలిసి పూలను కోయడం మంచి అనుభూతినిచ్చేది. ఇప్పుడు మార్కెట్‌లోనే అన్ని దొరుకుతున్నయ్. అంతా మొక్కుబడిగా మారింది. – స్వప్న, అప్పన్నపేట

బతుకమ్మ ఆటనే మార్చిండ్రు



రామగిరి: ఎంగిలి పూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ దాకా అప్పట్లో చప్పట్లు కొడుతూ స్వయంగా పాటలు పాడెటోళ్లం. ఇప్పుడు ఏడ జూసినా సౌండ్ బాక్స్‌లు పెట్టి పిచ్చి డ్యాన్స్‌లు చేస్తున్నారు. డీజే పాటలు పెట్టుకుని ఆడుతున్నారు. బతుకమ్మ ఆటనే మార్చిండ్రు. – మల్యాల లక్ష్మి, కల్వచర్ల

క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన శ్రీహరినాథ్ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్‌లో చేరగా ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.75,000 ఎల్‌వోసీ చెక్కును గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్‌లు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

గోదావరిఖని: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు లాడ్జీలను తనిఖీ చేశారు. ఐదు లాడ్జీలు, ఒక హోటల్‌లో తనిఖీలు నిర్వహించి అనుమానితులను ప్రశ్నించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డితో పాటు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ గ్రామాన్ని ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు అందించాలనే సంకల్పంతో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, నాయకులు మద్దెల రాజయ్య, రాపెల్లి రాజయ్య, బక్కతట్ల వినీత్, దాసరి చంద్రమౌళి, గాదం శ్రీనివాస్, తీగల సత్యనారాయణరావు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

సుల్తానాబాద్: సద్దుల బతుకమ్మకు ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో గురువారం చెరువుకట్ట వద్ద పిచ్చిమొక్కలను మున్సిపల్ కార్మికులతో తొలగించారు. మహిళలు బతుకమ్మ ఆడిన తర్వాత నిమజ్జనం చేసేందుకు ఇరువైపులా శుభ్రం చేసినట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్ ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

సాక్షి స్పందన

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన యైటింక్లయిన్ కాలనీ తెలంగాణ చౌరస్తా నుంచి హనుమాన్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో గతనెల 24న 'సాక్షి'లో 'ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కాలనీ కాంగ్రెస్ నాయకులు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈక్రమంలో రోడ్డును విస్తరించాలని ఆర్జీ–2 సింగరేణి యజమాన్యానికి ఎమ్మెల్యే సూచించడంతో గురువారం సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు 120 మీటర్ల సీసీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన ట్రినిటి విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్–14 బాక్సింగ్ పోటీలో సాత్విక్, శివశంకర్, అశ్విత్ శివ, రూపక్, కృష్ణ రేవంత్, అండర్–17లో మణిహాస్, వర్షిత్, అభిశ్రీత్, భవాని ఎంపికయ్యారు. 5,6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ రాకేశ్ తెలిపారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఓదెల: దేవీనవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. పొత్కపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రామగిరి: కల్వచర్ల గణేశ్ యూత్ ఆధ్వర్యంలో..



జ్యోతినగర్: భవానీ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు



సుల్తానాబాద్‌రూరల్: ఐతరాజుపల్లిలో..



యైటింక్లయిన్‌కాలనీ: గణేశ్‌నగర్ ఏరియాలో..



కాల్వశ్రీరాంపూర్: మంగపేటలో..



జూలపల్లిలో దుర్గామాతకు పూజలు

జిల్లావ్యాప్తంగా గురువారం దేవీశరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో దుర్గాదేవిని డప్పువప్పుళ్ల కోలాట నృత్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించారు. భక్తులకు బాలత్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



పెద్దపల్లిరూరల్: బ్రాహ్మణపల్లిలో..



ఓదెల: కొలనూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



సుల్తానాబాద్: శాస్త్రినగర్‌లో పూజలు

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

రామగిరి: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని విద్యార్థులు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి విజేతలుగా నిలవాలని మంథని డీఎల్‌పీవో సతీశ్ అన్నారు. సెంటనరీకాలనీలోని జేఎన్టీయూ గురువారం కళాశాలలో అండర్–16 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచే ఆటలపై ఆసక్తిని పెంపొందించుకుని, క్రీడల్లో రాణించాలని సూచించారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన పల్లె సాక్షిత్‌రావు ఆధ్వర్యంలో టీ20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండగా గురువారం సెంటనరీకాలనీ, గోదావరిఖని కృష్ణవేణి జట్లు తలపడ్డాయి. ఎంపీవో ఉమేశ్, మాజీ వార్డు సభ్యుడు తన్నీరు ప్రదీప్ పాల్గొన్నారు.

బేగంపేటలో డీఎల్‌పీవో పర్యటన

మండలంలోని బేగంపేటలో గురువారం మంథని డీఎల్‌పీవో సతీశ్ పర్యటించారు. గ్రామంలోని కుమ్మరివాడను గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రాంచందర్‌రావుతో కలిసి సందర్శించారు. మురుగునీటి కాల్వను పరిశీలించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే చర్యలు తప్పవన్నారు. ఐదురోజుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయా వార్డులను సందర్శించారు. ఎంపీవో ఉమేశ్, కార్యదర్శి రత్నాకర్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంథని డీఎల్‌పీవో సతీశ్

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తాం

గోదావరిఖని: కార్మిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. గురువారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో రానున్న రోజుల్లో స్ట్రక్చర్, జేసీసీ సమావేశాలు క్రమపద్ధతిలో జరిగేలా కృషి చేస్తూ ఎన్నికల ప్రణాళికను అమలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు సంకె అశోక్, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, మానాల శ్రీనివాస్, ఎంఏ గౌస్, నేరెళ్ళ తిరుపతి, గంగారపు చంద్రయ్య, ఆర్.రాజేశ్వరరావు, ఎర్రగొల్ల చేరాలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఇసుక ట్రాక్టర్ల పట్టివేత**

రామగిరి: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. గోదావరినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం ఉదయం పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాజాపూర్ గ్రామ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

- **మానేరులో గుర్తు తెలియని మృతదేహం**

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి మానేరులో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకువచ్చింది. ఎస్సై నరేశ్ చెప్పిన వివరాల ప్రకారం గుర్తు తెలియని మహిళ మృతదేహం వయసు 60 నుంచి 70ఏళ్లు ఉంటుందన్నారు. మృతురాలు ఎరుపురంగు చీరతో శరీరం కుళ్లిపోయి గుర్తుపట్టని విధంగా ఉందని ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని మంథని మార్చురీకి తరలించామని చెప్పారు.

- **రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి**

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని అల్లీపూర్ శివారులో గురువారం రాత్రి ద్విచక్ర వాహనదారు ప్రమాదవశాస్తు మృతిచెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాలు.. ఓదెల మండల కేంద్రానికి చెందిన బొమ్మడి చంద్రయ్య (60) తన మనవరాలు సుల్తానాబాద్ ఆసుపత్రిలో డెలివరీ కాగా, ద్విచక్ర వాహనంపై వచ్చి చూసి వెళ్తున్న క్రమంలో అల్లీపూర్ వద్ద తీవ్రగాయాలతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

- **రత్నాపూర్‌లో చెట్లపొదల తొలగింపు**

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో గురువారం చెట్లపొదలను తొలగించారు. సద్దుల బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలు ఇబ్బందులు పడతారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కండె పోచం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యకు విన్నవించారు. కాగా చెట్లపొదల తొలిగింపు చేపట్టారు.

- **మార్కెట్ చైర్మన్‌కు సత్కారం**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈర్ల స్వరూప, సురేందర్ దంపతులు గురువారం పట్టణంలోని కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాస్, గండు రంగయ్య, బూతగడ్డ సంపత్, పోతని పురుషోత్తం స్వరూప దంపతులకు మైసమ్మ చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

- **విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు**

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు షీటీం సిబ్బంది గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై మల్లన్న మాట్లాడుతూ మహిళలు వేధింపులకు గురైతే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

- **కాలనీ ఉపాధ్యక్షుడిగా సారయ్యనాయక్**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ కాలనీ పట్టణ ఉపాధ్యక్షుడిగా కాలనీకి చెందిన సారయ్య నాయక్‌ను నియమిస్తున్నట్లు కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చేతుల మీదుగా గురువారం నియామక పత్రం అందజేశారు.

- **కుంటలో నుంచి నీరు తీసిన వ్యక్తిపై చర్య తీసుకోండి**

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీరాములపల్లి సర్వే నెంబర్ 556లో ఉన్న కుంటలో నుంచి నీరు తీసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పట్టణ అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గరిగె శ్రీనివాస్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్లు రాజు, అంజయ్య, రాములు, రాజు, సభ్యులు నర్సయ్య, ప్రభాకర్, శంకర్, భీమరాజు, సంపత్, తిరుపతి, సమ్మయ్య, సురేశ్ ఉన్నారు.

- **ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం**

జ్యోతినగర్: ప్రజల సమస్యలు పరిష్కరించడమే సీపీఎం లక్ష్యమని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముత్యంరావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం సీపీఎం 23వ డివిజన్‌శాఖ మహాసభల్లో పాల్గొని ఇటీవల మృతి చెందిన పార్టీ నేతలు బుద్ధదేవ్ భట్టాచార్య, సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం డివిజన్ శాఖ కార్యదర్శిగా నాంసాని శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభల్లో సీపీఎం నాయకులు దండ రాఘవరెడ్డి, తుమ్మల నారాయణరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని విసంపేట గ్రామ రైతులకు గురువారం పామాయిల్ సాగుపై మండల వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ముందుగా పామాయిల్ సాగుతో కలిగే లాభాలతో పాటు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో కూడిన కరపత్రాలను రైతులతో ఆవిష్కరింపజేశారు.

- **మార్కెట్ కమిటీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి**

ధర్మారం: ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డులో లోవోల్టేజి సమస్యతో ప్యాడీ క్లీనర్ పనిచేయడం లేదని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గురువారం మార్కెట్ కార్యదర్శికి రైతులు వినతిపత్రం అందించారు.

- **డీసీసీ కార్యదర్శి పదవికి రహీం రాజీనామా**

జ్యోతినగర్: జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పదవికి ఎండీ రహీం రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో సాధారణ కార్యకర్తగా కొనసాగుతానని, తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

- **గ్రామ సమస్యలు పరిష్కరించాలి**

రామగిరి: మండలంలోని బేగంపేటలో వివిధ సమస్యలు పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ నాయకులు సందెల శ్రీనివాస్ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. హైదరాబాద్‌లో మంత్రి కార్యాలయంలో గురువారం కలిసి సమస్యలు విన్నవించా రు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు.

- **విపక్షాలపై బురదజల్లే విధానం సరికాదు**

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన మంత్రి కొండా సురేఖ తాను మంత్రిని అనే విషయాన్ని మరిచి మాజీ మంత్రి కేటీఆర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడారని బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గురువారం వారు నిరసన వ్యక్తం చేశారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపక్ష నాయకుల సలహాలు, సూచనలతో ముందుకు పోవాలి గానీ ఇలా విపక్షాలపై బురదజల్లే విధానం మంచిది కాదన్నారు.

సింగరేణి వార్తలు

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

గోదావరిఖని: స్ట్రక్చరల్ సమావేశాల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సీహెచ్‌పీలో గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధాన సమస్యలైన పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ వాపస్ ఇప్పించడం, సొంత ఇంటి పథకం అమలు చేయడం, మారుపేర్ల సమస్య పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. లాభాల వాటా విషయంలో కార్మికులను తప్పుతోవ పట్టించేందుకు కొన్ని సంఘాలు చేస్తున్న ప్రచారాన్ని కార్మికులు తిప్పికొట్టాలన్నారు. నాయకులు రాజరత్నం, అన్నారావు, జీగురు రవీందర్, సెగ్గం శంకర్, సాంబశివరావు, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

జీడీకే–11గని పాతదారి పరిశీలన

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా జీడీకే 11గని పాతదారిని జీఎం డి.లలిత్‌కుమార్ గురువారం పరిశీలించారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సూచనల మేరకు జీఎం బైక్‌పై ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి పరిశీలించారు. గతంలో ఈదారి మూసివేయడంతో డ్యూటీకి వెళ్లివచ్చే కార్మికులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు జీఎం బైక్‌పై పర్యటించి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించినట్లు ఐఎన్‌టీయూసీ నాయకులు సదానందం, పోతరవేని సమ్మయ్య, ఆంజనేయులు తెలిపారు.



పాతదారిని పరిశీలిస్తున్న జీఎం లలిత్‌కుమార్

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బి.అశోక్ మాట్లాడుతూ లాభాల్లో వాటా సులభ్, నర్సరీ, ఓబీలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. అనంతరం డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు డి.బుచ్చమ్మ, పులిపాక రమేశ్, వి.రాజనర్సు, కె.శారద పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో గురువారం నుంచి డిజిటల్ కార్డు సర్వే ప్రారంభించారు. ఈ వార్డు పరిధిలో 288 కుటుంబాలున్నాయి. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను సేకరించాల్సిన పద్ధతి పై కమిషనర్ ఆకుల వెంకటేశ్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

మంథని పరిధిలో..

మంథని: మంథని మున్సిపల్ పరిధిలో పైలట్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన 13వ వార్డులో సర్వేను గురువారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ ప్రారంభించారు. కుటుంబ సభ్యుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్లు వీకే రవి, గుండా విజయలక్ష్మి, నక్క నాగేంద్ర ఉన్నారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో గంగయ్య అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి(దుబ్బపేట్)ని ఎంపిక చేసి గురువారం సర్వే చేపట్టగా డీపీవో వీర బుచ్చయ్యతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం 5 బృందాలుగా ఏర్పడి సర్వే జరుగుతుందన్నారు. సర్వే అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో దివ్యదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీవో సమ్మిరెడ్డి ఉన్నారు.

గుడిపల్లిలో..

పాలకుర్తి: మండలంలోని గుడిపల్లిలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శశికళ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ విభాగాల అధికారులు టీంలుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీవో సుదర్శన్, మాజీ ఎంపీపీ గంగాధర రమేశ్, జయ్యారం మాజీ ఉపసర్పంచ్ గాజుల ఐలేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మంథని: సర్వేను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రమ

పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

గోదావరిఖని: సింగరేణి మైన్స్‌రెస్క్యూ 53వ, జోనల్ స్థాయి పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మైన్స్‌రెస్క్యూ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు ఈనెల 16,17వ తేదీల్లో మెయిన్‌రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జీడీకే–7ఎల్‌ఈపీ గనిపై ప్రాక్టికల్స్, రెస్క్యూ స్టేషన్‌లో థియరీతో పాటు ఇతర పోటీ పరీక్షలు ఉంటాయన్నారు. పోటీలు తిలకించడానికి వచ్చే కార్మిక కుటుంబాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

బల్దియా జూనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే మాదేసి శ్రీనివాస్ బుధవారం అకాల మరణం చెందాడు. గురువారం శ్రీనివాస్ భౌతిక కాయానికి నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీనివాస్ మృతిపై కమిషనర్, అధికారులు సంతాపం తెలిపారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

గోదావరిఖనిటౌన్: స్థానిక 32వ డివిజన్‌లోని మహిళలు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా బతుకమ్మ ఆడుకునేందుకు పలు కూడళ్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ అయిత శివకుమార్ అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు.